క్లుప్తంగా

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

చల్లపల్లి: ఇంద్ర, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్ తప్ప మిగతా అన్ని ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ హనుమంతరావు శుక్రవారం తెలిపారు. మహిళలు ఆధార్ కార్డు, ఐడి కార్డు, అడ్రస్, ఫొటో ప్రూఫులు ఉన్న మరే ఇతర కార్డు నైనా చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులకు రూ.5వేలు చొప్పున భావదేవరపల్లిలోని కెనరాబ్యాంకు అధికారులు శుక్రవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. పాఠశాల హెచ్.ఎం కొల్లు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కె.అశ్వినీకుమార్ చేతుల మీదుగా 6, 7, 8 తరగతుల విద్యార్థులకు అందజేశారు. అలాగే శ్రీఅన్నపూర్ణదేవి ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు వితరణతో 10వ తరగతిలో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులకు కలిపి రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. సర్పంచి మండలి ఉదయభాస్కర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎంవీ సాంబశివరావు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పరిశె లక్ష్మీతిరుపతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లమంద రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



ఎదురుమొండి(నాగాయలంక): దీవిలోని ఎదురుమొండి–జింకపాలెం వెళ్లే ప్రధాన మార్గంలో గొల్లమంద సమీపంలో కృష్ణానది వరద తాకిడికి కోతకు గురవుతున్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ ఆదేశాలతో నాగాయలంక తహసీల్దార్ సీహెచ్.వి.ఆంజనేయప్రసాద్, పీఆర్ జేడీ నాగరాజు శుక్రవారం తాత్కాలిక పనులను ముమ్మరం చేశారు.నదీ ప్రవాహానికి గురవుతున్న రోడ్డును నది వైపు మట్టి జారిపోకుండా కర్రలు పాతి మధ్యలో మట్టి ఫిల్లింగ్ చేస్తూ చర్యలు చేపట్టారు.

రోగుల సౌకర్యార్థం నిర్మించిన షట్టర్ ప్రారంభం

కృత్తివెన్ను: రోగుల సౌకర్యార్థం రూ. 3 లక్షలు మండల పరిషత్ నిధులతో లక్ష్మీపురంలో నిర్మించిన షట్టర్‌ను శుక్రవారం ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ ప్రారంభించారు. లక్ష్మీపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలమైపోయింది. దాని నిర్మాణం జరిగే వరకు ప్రస్తుతం తాత్కాలికంగా పీహెచ్‌సీని స్థానిక పంచాయతీ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్నారు. ఎక్కువగా వస్తున్న రోగుల సౌకర్యార్థం ఎంపీపీ నిధులతో షట్టర్ నిర్మించి ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి



అవనిగడ్డ: దివిసీమలో వరద ఉధృతి కొనసాగుతోంది. పులిగడ్డ అక్విడెక్టును తాకుతూ కృష్ణమ్మ ప్రవహిస్తోంది. రహదారి కొట్టుకుపోయిన ఎడ్లంక గ్రామస్తులు పడవ ద్వారానే ప్రయాణం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో పలు గృహాలు వరద కోతకు గురై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఎడ్లంక వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. కోతకు గురైన గృహ బాధితులకు వేరే ప్రాంతాల్లో నివేశన స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. వరద సహాయక చర్యలను తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు.

ఇసుక మూటలతో అడ్డుకట్ట

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండలంలోని ఉత్తర చిరువోలులంక గ్రామానికి కృష్ణానది వరదనీరు చొచ్చుకురాకుండా కరకట్ట అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద ఇసుక మూటలతో నిలుపుదల చేసినట్లు ఇన్‌ఛార్జీ తహసిల్దార్ వనజాక్షి శుక్రవారం తెలిపారు. కాగా అధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నతుమ్మిడి సర్పంచి మృతి

బంటుమిల్లి: మండలంలోని చిన్నతుమ్మిడి గ్రామ సర్పంచి ఓరుగంటి యజ్ఞేశ్వర వెంకటాచలం (60) అనారోగ్యంతో శుక్రవారం హైదరాబాదులో మృతిచెందారు. భూస్వామి అయిన ఆయన రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి సర్పంచిగా, ఎంపీటీసీ సభ్యుడిగా సేవలందించారు. శ్రీవేద గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం తొలి అధ్యక్షుడిగా సంఘం బలోపేతానికి కృషి చేశారు. శనివారం మచిలీపట్నంలోని ఆయన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

ఘనంగా 79వ స్వాతంత్ర్య వేడుకలు

మచిలీపట్నంటౌన్: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని మచిలీపట్నం మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పార్టీల కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను మేయర్ వెంకటేశ్వరమ్మ ఎగురవేశారు. డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్లు, కమిషనర్ బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ఉద్యోగులు పాల్గొన్నారు. కోనేరు సెంటర్లోని స్థూపంపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే హిందూ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక హిందూ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. స్థానిక కొత్త మసీదు సెంటర్లో ఉన్న అబుల్ కలాం ఆజాద్ స్థూపం వద్ద ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ వద్ద ఆ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్ జెండాను ఎగురవేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు అబ్దుల్‌మతిన్ జెండా వందనం చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఒడుగు చైతన్య, బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ జాతీయ జెండాను ఎగురవేశారు.

నాగాయలంకలో...



నాగాయలంకలో జెండా ఆవిష్కరించిన తహసీల్దార్ ఆంజనేయప్రసాద్

నాగాయలంక: మండలంలో వాడవాడలా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. నాగాయలంక మండల రెవిన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ జాతీయజెండా ఎగురవేశారు. డెప్యూటీ తహసీల్దార్ మండలి కేశవి, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద స్టేషన్ ఎస్.ఐ కలిదిండి రాజేష్, పోలీస్ సిబ్బంది జాతీయ జెండా ఆవిష్కరించారు. స్థానిక గ్రామపంచాయితీలో గ్రామ సర్పంచి కైతేపల్లి అంకాలు జెండా ఎగురవేశారు. మండల ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో సంఘం నాయకులు గాంధీజీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి.



అవనిగడ్డ పార్టీ కార్యాలయం వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి, నేతలు



జాతీయ జెండాను ఎగురవేసిన మేయర్ వెంకటేశ్వరమ్మ

పెడన: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్ సీపీ పెడన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రమేష్ (రాము) ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ రాజులపాటి వాణి, భండారు ఆనందప్రసాద్, గరికపాటి వెంకటరామానాయుడు, దావు బైరవలింగం, రాలజులపాటి అచ్చుతరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలను పంచారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో జెండాను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాజులపాటి వాణి జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులు ఫర్హతుల్లా, రఫీకుద్దీన్, జానకీలక్ష్మీలకు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. డీటీ నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు. పెడన పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ జాతీయ జెండాను ఎగురవేశారు.



కలంకారీ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర, ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావు

మోపిదేవిలో..



కొత్త మసీదు సెంటర్లో జాతీయ జెండాను ఎగురవేసిన ముస్లిం జేఏసీ నాయకులు

మోపిదేవి: మండలంలో గ్రామ గ్రామాన స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ, వెటర్నరీ కేంద్రం, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్, పీఏసీఎస్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు చాక్లెట్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, ఎంపీపీ రావి దుర్గావాణీ, గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీ రాణీ, కోసూరు అనూష, ఎ. సంధ్యారాణీ, జి. వెంకటేశ్వరావు, జానకీరాంబాబు, తహసీల్దార్ వనజాక్షి, ఎంపీడీఓ స్వర్ణభారతి, వెటర్నరీ డాక్టర్ నంద కిషోర్, ఏఓ హెప్సీబారాణీ, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



కోడూరు ప్రధాన సెంటర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చల్లపల్లి: మండలంలోని పాగోలులో ఉన్న ఎన్టీఆర్ మోడల్ స్కూల్లో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి కె.సునీల్‌చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ధైర్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ గంగవరపు మధుసూధనరావు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీడీవో ఏవీ రమణ జాతీయ జెండా ఎగురవేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ ఈశ్వరరావు, మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ కె.మురళీకృష్ణ, ఎన్టీఆర్ పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం జెండాను ఆవిష్కరించారు.



భరతమాత వేషధారణలో అలరించిన యువతి

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలను జరుపుకొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల వద్ద వేడుకలు జరిగాయి.

గూడూరు మండలంలో..

గూడూరు: స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం గూడూరు మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూధనరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, గూడూరు సర్పంచి లింగం సులోచనారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.వి.రామకృష్ణ, ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం, ఏఈ జవహర్ పాల్గొన్నారు.

వాడవాడలా స్వాతంత్ర్య శోభ

కోడూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, కోడూరు, ఉల్లిపాలెం, హంసలదీవి సచివాలయాల వద్ద సర్పంచులు వెన్నా షైనీ, వెర్రీ పావని, కొక్కిలిగడ్డ బీక్షాలు త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ చాణిక్య, పాలకాయతిప్ప మెరైన్ స్టేషన్ వద్ద సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ పూర్ణమాధురి, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏఈ గోపిచంద్, గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అధికారిణి పుష్పలత జెండాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణరావు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన వేడుకలు

బంటుమిల్లి: మండలంలో ప్రతి గ్రామంలో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వి.చినబాబు, తహసిల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు జెండా ఆవిష్కరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గణేష్ కుమార్, ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ వెంకటరమణ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయమూర్తి భాస్కరరావు జెండా వందనం చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద నాయకులు జెండా ఎగరవేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎంపీపీ వి.చిన బాబు, రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కమల్‌భాష, వీర బాబు, మండల ప్రధాన కార్యదర్శి పి.శివనాయకులు పాల్గొన్నారు.



బంటుమిల్లిలో జెండా వందనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఘంటసాలలో..



ఘంటసాలలో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వేమూరి రజనీకుమారి

ఘంటసాల: స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ వేమూరి రజనీకుమారి, ఎంపీటీసీ కొండేటి నీలవేణి, ఎంపీడీవో డి.సుబ్బారావు, ఎంఈఓ 2 ఎండీ మోమిన్, డిప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావులు జాతీయ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.విజయప్రసాద్, కేవీకేలో సమ్యయకర్త డాక్టర్ డి.సుధారాణి జెండా ఆవిష్కరించారు. మండలంలోని తాడేపల్లి గ్రామపంచాయతీ, కుమ్మరిపాలెంలో సర్పంచ్ పడమట సీతామహాలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు పడమట వీర కుమార్, తాతినేని కృష్ణారావు, తాతా రాజా, ఉపసర్పంచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు. అలాగే ఘంటసాల పెద్దగూడెంలోని అమ్మ నాన్న ట్రస్టు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



పెడనలో జెండాను ఆవిష్కరించిన ఉప్పాల రాము

స్వాతంత్ర్యం మహనీయుల త్యాగ ఫలితం

మచిలీపట్నంఅర్బన్: స్వాతంత్ర్యం మహనీయుల త్యాగ ఫలితమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బెలూన్లు ఎగురవేసి, ఉత్తమ సేవలు అందించిన వైద్యులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మౌలిక వసతులు బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఆశాలత, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నిరంజన్‌రావు, డాక్టర్ భానుమూర్తి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజారమణి, ఆశ సజని, కార్పొరేటర్ అనిత, మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.



శక్తి టీమ్ ప్రదర్శన

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగ ఫలితంగా స్వరాజ్యం వచ్చిందని పేర్కొన్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించారు. పోస్టల్ ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులతో హెడ్ పోస్ట్ ఆఫీస్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కోనేరు సెంటర్ వరకు సాగింది. కార్యక్రమంలో పోస్టల్ సబ్ డివిజనల్ హెడ్స్ టీ నాగరాజు, కేవీ కిరణ్‌కుమార్, జీవీ బెనర్జీ, హెడ్‌పోస్ట్ మాస్టర్ ఎం.శివప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు ప్రతిభ కనబరిచిన డివిజన్ స్థాయి పోస్టల్ ఉద్యోగులకు ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. తొలుత పోస్టల్ సూపరిండెండెంట్ శ్రీనివాసరావు హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఉద్యోగులు

అధికార పార్టీ అయితే అనుమతులతో పని లేదా?

- పెడనలో అనుమతుల్లేకుండా భవన నిర్మాణం
- పనులు నిలిపి వేశామంటున్న అధికారులు
- ఆదేశాలు పట్టని నిర్మాణదారులు

పెడన: అనుమతులు లేవంటున్నారు. పనులు నిలిపి వేయించామని చెబుతున్నారు.. కానీ నిర్మాణం మాత్రం యథాతథంగా జరిగిపోతోంది. అధికారులు చెబుతున్న మాటలకు.. జరుగుతున్న తీరుకు పొంతన కుదరడం లేదు. పెడన పట్టణంలోని తోటమూల సెంటరులో టీడీపీ నాయకుడు ఎటువంటి అనుమతులు లేకుండా జీ ప్లస్–2 భవన నిర్మాణం చేపడుతున్నారు. ఎదురుగా స్థానిక ఎమ్మెల్యే ఫొటోతో ఫ్లెక్సీ పెట్టి మరీ నిర్మాణం పనులు చేస్తున్నాడు. దీంతో ఇలాంటి వాటిని ప్రజాప్రతినిధులే ప్రోత్సహించినట్టుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు అనుమతుల్లేకుండా జీ ప్లస్–2 నిర్మాణం మొదలు పెట్టినా మున్సిపల్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం ఆరోపణలకు తావిస్తోంది. సెలవు రోజుల్లో మాత్రమే నిర్మాణ పనులు సాగుతుండటం, పనులు పూర్తయ్యాక మున్సిపల్ అధికారులు తాపీగా వచ్చి పనులు ఆపేశామని పేర్కొనడం మరిన్ని అనుమానాలకు దారితీసింది. అనుమతుల కోసం వార్డు సచివాలయంలో దరఖాస్తు చేశామని నిర్మాణదారుడు చెబుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం తాము అనుమతులు మంజూరు చేయలేదని పేర్కొనడం విశేషం. దీనిపై అధికారులను వివరణ కోరగా తోటమూల వద్ద నిర్మిస్తున్న జీ ప్లస్–2 భవనానికి అనుమతులు రాలేదని పెడన పురపాలక సంఘ టీపీవో బి.సుజనకుమారి పేర్కొన్నారు. శ్లాబు పనులు జరుగుతున్నాయని తమ దృష్టికి రావడంతో పనులు ఆపేశామని చెప్పారు. పనులు పూర్తయిపోతున్నాయి కదా అన్న ప్రశ్నకు సమాధానంగా అనుమతుల కోసం దరఖాస్తు చేశారని, పై నుంచి అనుమతి వచ్చే వరకు పనులు నిలుపుదల చేయాలని యాజమానికి స్పష్టం చేసినట్టు చెప్పారు.



అనుమతులు లేకుండా నిర్మిస్తున్న జీ ప్లస్–2 భవనం

- **భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు**

గణపేశ్వరం(నాగాయలంక): శ్రావణమాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకుని స్థానిక దుర్గా గణపేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ఏకాదశ శ్రీసూక్త విధానంతో 21రకాల పూజా ద్రవ్యాలతో అమ్మవారికి మహాభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, దుర్గమ్మ భక్త బృంద సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీరంగ నాయకస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక శ్రావణ వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. వరలక్ష్మి పూజలో పాల్గొన్న వారికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ మాగపాటి సత్యప్రసాదబాబు పర్యవేక్షించారు.

శ్రీకాకుళేశ్వర ఆలయంలో..

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన వరలక్ష్మీ వ్రతాల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. తొలుత ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

- **విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

మోపిదేవి: స్థానిక జడ్పీ పాఠశాలలో గత పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. మాజీ సర్పంచ్, కామ్రేడ్ కంఠంనేని అచ్యుతరామయ్య జ్ఞాపకార్థ వారి కుటుంబ సభ్యులు ట్రస్ట్ ద్వారా నగదు బహుమతులు అందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు దాసి బ్యూలా, పి.శివనాగజ్యోతి, కె.చేతనసౌమ్యలకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు నగదు అందించారు. అలాగే 6వ తరగతి విద్యార్థినులు ఎం. మౌనిక, కె. హాసిని రాగశ్రీ, సీహెచ్ అఖిలకు సైకిళ్లు బహుకరించారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ నందిగం మేరీ రాణీ, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు పిచ్చేశ్వరావు, కంఠంనేని కుటుంబ సభ్యులు రత్నప్రసాద్, రాము, ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **చికిత్స పొందుతూ యువకుడు మృతి**

పెడన: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు పోలగాని సాయి(23) విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పెడన పోలీసుల కథనం మేరకు.. ఈనెల 10వ తేదీన మండలంలోని నడుపూరు అగ్రహారం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ఆసుపత్రికి రిఫర్ చేశారు. నందిగామ గ్రామానికి చెందిన పోలగాని సాయి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పెడన ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

త్రిమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని పీఏసీఎస్‌కు నూతనంగా ఏర్పాటైన త్రిమెన్ కమిటీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా తిరుమలశెట్టి రాంబాబు, సభ్యులుగా గోపు రాఘవరాజు, డొక్కు భీమరాజుల చేత పీఏసీఎస్ కార్యదర్శి పి.వేణుగోపాలరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను నేతలు సన్మానించారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మచిలీపట్నం బ్రాంచి వారి సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా పిట్టు ఉజ్వ గణపతి భాగ్యరాజు S/o. పిట్టు రామకృష్ణారావు, కృష్ణాజిల్లా, గూడూరు మండలం, రామరాజుపాలెం గ్రామమునకు చెందిన వారి యొక్క దిగువ షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని పిట్టు ఉజ్వ గణపతి భాగ్యరాజు గారికి ఋణము మంజూరు చేయదలచినారు. కావున ఈ ఆస్తిపై ఎవరికైనను ఎట్టి హక్కులు గానీ, అభ్యంతరములు, క్రయములు గానీ వున్న యెడల ఈ క్రింది చిరునామాకు 7 రోజులలోగా తగు సాక్ష్యాధారాలతో తెలియపరచవలెను. ఎట్టి అభ్యంతరములు రాని యెడల ఈ ఆస్తి నిర్వివాదమైనదిగా భావించి ఋణము మంజూరు చేయగలము. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూల్: కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్‌రిజిస్ట్రారు వారి ఋరాశా, గూడూరు మండలం, రామరాజుపాలెం గ్రామ పంచాయితీ ఏరియాలోని రామరాజుపాలెం గ్రామంలోని ఆర్.ఎస్.నెం. 32/8, 32/9, & 32/10బి, పంచాయితీ వార్డు-2 డోర్ నెం. 2/147నకు సమీపమున గల ప్లాటు నెం. 11లోని డాక్యుమెంట్ నెం. 23990/2024లోని 216.90 చ.గ. ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. **తూర్పు:** పరసా శంకరబాబు గారి ప్లాటు నెం. 12 స్థలం. అ. 54–3లు, **దక్షిణం:** నాచే ఏర్పాటుచేయబడిన అ. 20లు వెడల్పుగల రోడ్డు అ. 35.0లు, **పడమర:** ప్లాటు నెం. 10 నేను ఈ రోజు మీకు విక్రయించిన స్థలం. అ. 57–4లు, **ఉత్తరం:** కోమటి వెంకటేశ్వరరావు గారి స్థలం అ. 35–2లు. ఈ హద్దుల మధ్య నివేశన స్థలము కలదు.

మచిలీపట్నం
ది. 15–8–2025

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు,
న్యాయవాది, మచిలీపట్నం